క్లుప్తంగా

జిల్లా స్థాయిలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించాలి

ఒంగోలు మెట్రో: జిల్లా యంత్రాంగం ఈ నెల 30వ తేదీ విశ్వావసు తెలుగు నామ సంవత్సర (ఉగాది) పండుగ సందర్భంగా జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించాలని గిడుగు రామమూర్తి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త నెమ్మాని సీతారామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలు ఉండేవని, వాటిని పునరుద్ధరించాలని ఆయన కోరారు. అలాచేయడం వలన నేటి తరానికి తెలుగు భాష పట్ల మమకారం, మక్కువ ఏర్పడతాయన్నారు.

కేవీబీ నూతన బ్రాంచ్ ప్రారంభం



కరూర్ వైశ్య బ్యాంకు నూతన బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న కమిషనర్, బ్యాంకు అధికారులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు డివిజన్ పరిధిలో కరూర్ వైశ్య బ్యాంకు (కేవీబీ) 56వ బ్రాంచ్‌ను సోమవారం స్థానిక ముంగమూరు రోడ్డులో ప్రారంభించారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రారంభించగా, బ్యాంకు డివిజనల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాదు మాట్లాడుతూ ఒంగోలు డివిజన్ పరిధిలో ఇప్పటికే 55 బ్రాంచిలు ఉన్నాయని, నూతనంగా ప్రారంభించిన ఈ బ్రాంచితో 56కు చేరుకున్నాయని తెలిపారు. 1916లో రూ.లక్ష మూల ధనంతో ప్రారంభమైన ఈ బ్యాంకు.. 2024 డిసెంబర్ నాటికి రూ.496.03 కోట్ల నికర లాభంతో మొత్తం రూ.1.81 లక్షల కోట్ల వ్యాపారాన్ని నమోదు చేసిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకు సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒంగోలు నగరంలో పెరుగుతున్న జనాభాతో పాటు అన్ని రకాల బ్యాంకుల బ్రాంచ్‌లను కూడా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శాఖల విస్తరణ అవసరమన్నారు. బ్యాంకు బ్రాంచితో పాటు ఏటీఎం సెంటర్‌ను కూడా ప్రారంభించారు. బ్యాంకు లోపల సేఫ్ రూమును కమలా నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ మండువ కమల సుభాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎస్.సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

● కాలి బూడిదైన ప్రథమ చికిత్స కేంద్రం



అగ్నిప్రమాదం జరిగిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శిస్తున్న బీజేపీ నాయకులు

సంతనూతలపాడు: షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ప్రథమ చికిత్స కేంద్రం కాలి బూడిదైంది. ఆ వివరాల ప్రకారం .. సంతనూతలపాడు మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో గ్రామీణ వైద్యుడు ఉప్పుటూరి మల్లికార్జునరావు ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్నారు. దాంతో పాటు చిన్నపిల్లలకు గాజులు, బొట్టుబిళ్లలు వంటి ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయిస్తూ భార్యాభర్తలు జీవిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 11 నుంచి 11:30 గంటల మధ్యలో అనేకసార్లు కరెంటు పోతూవస్తూ ఉండటంతో ప్రథమ చికిత్స కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించింది. అప్పుడే భోజనానికి ఇంటికి వెళ్లిన మల్లికార్జునరావుకు చుట్టుపక్కల వారు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు వెంటనే ప్రథమ చికిత్స కేంద్రానికి చేరుకునేలోపే మొత్తం కాలి బూడిదైంది. చుట్టుపక్కల వారు నీటితో మంటలార్పి అదుపు చేశారు. గ్రామ సర్పంచ్ కుంచాల పుష్ప భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బారావు బాధితుడు మల్లికార్జునరావును పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ మండలాధ్యక్షుడు కళ్యాణ్‌రెడ్డి బాలినేని ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, నాయీ బ్రాహ్మణ సాధికారత కన్వీనర్ కే నరసింహారావు, టీఎన్‌సీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు, సంతనూతలపాడు పారామెడికల్స్ సంఘటన స్థలాన్ని సందర్శించి సాయం చేస్తామని ప్రకటించారు.

ఘనంగా త్యాగరాజ సంగీత కార్యక్రమాలు

ఒంగోలు మెట్రో:

స్థానిక గాయత్రీ మందిరం నిర్వహణలో త్యాగరాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఒంగోలు మంగమూరుడొంక గాయత్రి మందిరంలో తృతీయ సంగీత కార్యక్రమాలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా మందిర ప్రాంగణ వేదికపై ప్రముఖ వ్యాపారవేత్త తూనుగుంట మల్లికార్జునరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో త్యాగరాజ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పిన్నం రాజునరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



చీమలమర్రి బస్టాండ్ వద్ద ఒకవైపు పారాపీట్‌వాల్ లేని ఎన్‌ఎస్పీ కాలువ వంతెన



చీమలమర్రి - మంచికలపాడు రోడ్డుపై రెండువైపులా పారాపీట్‌వాల్ లేని ఎన్‌ఎస్పీ కాలువ వంతెన

ఆదమరిస్తే అంతే సంగతులు..!

చీమకుర్తి రూరల్: మండల పరిధిలోని చీమలమర్రి బస్టాండ్ సమీపంలో ఎన్‌ఎస్పీ కాలువపై వంతెన శిథిలావస్థకు చేరి మరమ్మతులకు నోచుకోక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఒంగోలు నుంచి కర్నూలు వెళ్లే రహదారిపై ఉన్న ఈ వంతెనకు ఉన్న పారాపీట్‌వాల్ శిథిలావస్థకు చేరింది. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదం వలన పారాపీట్‌వాల్ దెబ్బతింది. అనంతరం కూడా ఈ ప్రాంతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రాణనష్టం కూడా వాటిల్లింది. ఎంతోమంది వాహనదారులు కాలువలో పడి గాయపడ్డారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేకుండా పోయింది.

చీమలమర్రి – మంచికలపాడు రోడ్డులో...

చీమకుర్తి మండలంలోని చీమలమర్రి కూడలి నుంచి మంచికలపాడు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై మరో ఎన్‌ఎస్పీ కాలువ ఉంది. రహదారి కిందిగా కాలువ ప్రవహిస్తుండగా, ఇక్కడ కూడా రోడ్డుకు రెండువైపులా పారాపీట్ వాల్ లేదు. కనీసం రోడ్డుకు సైడు మార్జిన్ కూడా లేకపోవడంతో ప్రయాణాలు చేసేవారు ఏమాత్రం ఆదమరిచినా రెండువైపులా ప్రవహిస్తున్న కాలువలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గతంలో ఎంతోమంది వాహనదారులు ఇక్కడ కాలువలో పడిన దాఖలాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పారాపీట్ వాల్ నిర్మించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరికొన్ని ప్రమాదాలు జరగకముందే ఎన్‌ఎస్పీ కాలువలపై నిర్మించిన వంతెనలకు రక్షణ గోడలు నిర్మించాలని, ఆయా ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్యాస్ ఏజెన్సీ, రైస్ మిల్లును తనిఖీ చేసిన జేసీ



గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు: స్థానిక విజయలక్ష్మి గ్యాస్ ఏజెన్సీతో పాటు గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని మురళీకృష్ణ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లును జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఉద్యోగులతో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ బరువు సక్రమంగా ఉందా..లేదా అనే విషయాన్ని వేయింగ్ మిషన్ వద్ద పరిశీలించారు. ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం గ్యాస్ ఏజెన్సీ రికార్డులు పరిశీలించారు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లోని బాయిల్డ్ రైస్ మిల్లును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట మద్దిపాడు తహసీల్దార్ సుజన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యమానికి సావిత్రిబాయి పునాదులు



ఒంగోలులో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరి, తదితరులు



చీమకుర్తిలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ, ఎస్సీ ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: దేశంలో తొలి ఉపాధ్యాయురాలిగా ఎన్నో ఆటంకాలు ఎదుర్కొని మహిళల విద్య కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే మహిళా ఉద్యమానికి పునాదులు వేశారని జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా జ్యోతీబా పూలే, తన స్నేహితురాలు ఫాతిమా షేక్‌తో కలిసి మహిళల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేశారని తెలిపారు. కులం, లింగం ఆధారంగా జరుగుతున్న వివక్షను నిలదీశారని, మహిళా చైతన్యం కోసం 1848లో తొలిసారిగా బాలికల పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. సామాజిక సమస్యలపై పోరాడుతూనే దేశంలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు కుమారుడితో కలిసి పూణే శివారులో వైద్యశాల ఏర్పాటు చేశారన్నారు. నేటి మహిళలు, బాలికలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది టి.కృష్ణవేణి, కె.సంపూర్ణమ్మ, ఇమ్మానుయేలు, అనిల్ కుమార్, మృదుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: అణగారిన వర్గాలు, మహిళలకు సావిత్రీబాయిపూలే చేసిన సేవలను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని బీసీ, ఎస్సీ ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సావిత్రీబాయిపూలే వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం చీమకుర్తిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అని, ఎంతో మందిని విద్య ద్వారా చైతన్యవంతం చేశారని గుర్తు చేశారు. పిన్నిక శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్తపు రాఘవ, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఉప్పుతోళ్ల నారాయణ, తెల్లమేకల గాంధీ, మర్రి లక్ష్మీనారాయణ, పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా, ఎస్.హరిప్రసాద్, చల్లా శ్రీనివాస్, మద్దాళి రాఘవరావు, పాటిబండ్ల రాజసులోచన పాల్గొన్నారు.

బూచేపల్లి, చుండూరును కలిసిన భూమిరెడ్డి



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, చుండూరి రవిబాబులకు కృతజ్ఞతలు తెలుపుతున్న భూమిరెడ్డి రమణమ్మ, తదితరులు

ఒంగోలు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబులను పార్టీ మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీగా నియమితులైన భూమిరెడ్డి రమణమ్మ సోమవారం ఒంగోలులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆమె వెంట పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, మహిళా నాయకులు బత్తుల ప్రమీల, సాదన్ విజయలక్ష్మి, బొప్పరాజు జ్యోతి, మేరీ, వాణి, రాజేశ్వరి, టి.మాధవి, బి.రమణమ్మ పాల్గొన్నారు.

బూచేపల్లి, చుండూరును కలిసిన కర్నేటి ప్రసాద్...

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చుండూరు రవిబాబులను సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కర్నేటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, తదితరులు ఉన్నారు.

పూలేని ఆదర్శంగా తీసుకుందాం



పీహెచ్‌సీ డీడీఓ డాక్టర్ పి.హరిణిని సత్కరిస్తున్న ప్యానల్ న్యాయవాది రవికుమార్, తదితరులు

సంతనూతలపాడు: పేద వర్గాల విద్యాకు కట్టుబడిన మహోన్నత మాతృమూర్తి సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకుందామని సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు, డీడీఓ డాక్టర్ పి.హరిణి పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి ఆదేశాల మేరకు మండలంలోని అనేక గ్రామాల్లో దివ్యాంగులపై సర్వే చేసిన ఇంటిగ్రేటెడ్ లీగల్ టీం ముగింపు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సంచాలకులుగా సీహెచ్‌ఓ ఆర్.ప్రసాద్ వ్యవహరించగా, ప్యానల్ న్యాయవాది, జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ నూకతోటి రవి కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ హరిణి మాట్లాడుతూ ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పేద వర్గాల విద్యార్థులకు విద్యా బోధన చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అన్నారు. జిల్లా లోక్ అదాలత్ కోర్టు వారు ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ లీగల్ టీం ద్వారా మండలంలోని అనేక గ్రామాల్లో దివ్యాంగులపై సర్వే నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని ఆమె అన్నారు. అనంతరం సర్వేకు సహకరించిన ఏఎన్ఎం, ఆశా వర్కర్లను సత్కరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ పి.సతీష్, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎద్దు విజయ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జె.నాగరాజు, డాక్టర్ ప్రశాంతరెడ్డి, పీహెచ్ఎన్ ఎం.వీరమ్మ, ఎస్.సలోమి, ఏఎన్ఎం డి.భాగ్యలక్ష్మి, కె.కృష్ణవేణి, హెల్త్ సూపర్‌వైజర్ బి.కృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొనగా, మహిళా దినోత్సవం సందర్భంగా పలువురిని సత్కరించారు.

రాయచోటి ఘటనపై వీహెచ్‌పీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: హిందువుల ఐక్యత వర్ధిల్లాలి, వీరభద్రస్వామి ఊరేగింపుపై దాడి చేసిన అన్యమతస్తులను అరెస్ట్ చేయాలని నినాదాలు చేస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం వందలాదిమంది హిందువులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈమని బలరాం మాట్లాడుతూ రాయచోటిలో వీరభద్రస్వామి వారోత్సవాలలో భాగంగా స్వామివారికి మేళతాళాలతో నగరోత్సవం నిర్వహిస్తుండగా వందల సంఖ్యలో వచ్చిన అల్లరి మూకలు మేళాలు ఆపాలని గొడవకు దిగారని, పోలీసుల రాకతో, వారి సూచన మేరకు మేళతాళాలు ఆపి స్వామివారి ఊరేగింపు నిర్వహించారని తెలిపారు. తిరిగి అదే దారిలో వెళ్తుండగా, రాళ్లు, చెప్పులు, మంచినీటి బాటిళ్లు విసిరి గొడవకు దిగారని, కానీ, ఏకపక్షంగా హిందువులపై కేసులు పెట్టి అరెస్టు చేయడం జరిగిందని, అరెస్టు చేయబడిన హిందువులను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేకుంటే వారం లోపు రాష్ట్రవ్యాప్తంగా చాలో రాయచోటి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. ఇదే ఘటనపై జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణకు హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావు, విభాగ్ విశేష సంపర్క ప్రముఖ్ ఇనమనమెళ్లూరి సీతారామయ్య, త్రిపుర భైరవానందస్వామి, పసుమర్తి వెంకటేశ్వర్లు, సాధు శ్రీనివాస్ గుప్తా, వేమూరి చక్రధర పెరుమాళ్లు, పబ్బిశెట్టి హరిబాబు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శివాజీ, సింగోతు ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, విభాగ్ ప్రచారఖ్ చంద్రశేఖర్, మనోజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, నిడమానూరి కళ్యాణ్ చక్రవర్తి, పీవీ కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, బి.విజయరావు, తీగల సత్యవతి, తానికొండ సురేష్, ధనిశెట్టి రామునాయుడు, వీహెచ్‌పీ జిల్లా ప్రచార ప్రముఖ్ రాధా రమణగుప్తా జంధ్యం, హిందూ చైతన్య వేదిక కన్వీనర్ దగ్గుమాటి వెంకారెడ్డి, గొలిమి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి కుళాయిల్లో మురుగునీరు

● సంతనూతలపాడు వడ్డెరపాలెంలో మహిళల ఆవేదన



ప్రజలను సమస్యలడిగి తెలుసుకుంటున్న నాయకులు

సంతనూతలపాడు: గ్రామ పంచాయతీ వారు సరఫరా చేసే మంచినీటి కుళాయిల్లో మురుగునీరు వస్తోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సోమవారం మూడోరోజు సంతనూతలపాడులోని వడ్డెరపాలెంలో నాయకులు పర్యటించారు. ప్రజలను కలిసి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను నాయకుల దృష్టికి పలువురు మహిళలు తీసుకొచ్చారు. హౌసింగ్ స్కీం కింద గృహ నిర్మాణానికి ఫౌండేషన్ వేసుకున్నామని, బిల్లులు కూడా రాలేదని, అందువల్ల ఇల్లు పూర్తి కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. భర్త చనిపోయి 7 నెలలు కావస్తున్నా ఇంతవరకు వితంతు పెన్షన్ ఇవ్వలేదని ఇద్దరు మహిళలు తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంతో నష్టపోతున్నామని అనేకమంది ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం మండల నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, బంకా సుబ్బారావు, వి.సంపత్, పి.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల సమాజ సేవ అభినందనీయం

● తహసీల్దార్ సుజన్ కుమార్



జ్యోతి వెలిగించి ఎన్ఎస్ఎస్ క్యాంపును ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, తదితరులు

మద్దిపాడు: నర్సింగ్ విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా సమాజ సేవలో పాల్గొనడం అభినందనీయమని మండల తహసీల్దార్ సుజన్ కుమార్ అన్నారు. సోమవారం మద్దిపాడు పీహెచ్‌సీలో ఒంగోలు రిమ్స్ నర్సింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎంపీడీవో వరప్రసాద్, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, డాక్టర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ అంటేనే సేవ అని, పైగా ఆ విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందించదగిన విషయమని అన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులలో ఆలోచన కలిగే విధంగా వారికి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి మద్దిపాడును ఎంచుకోవడం మంచి విషయమన్నారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు శిరీష, వినీల మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, మద్దిపాడులో స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేయడంపై అభినందనలు తెలిపారు. చిన్నారులకు, చంటి బిడ్డల తల్లులకు, 16 సంవత్సరాల్లోపు విద్యార్థులకు వ్యాక్సిన్ కార్యక్రమాలు ఏ విధంగా నిర్వహిస్తారో నర్సింగ్ విద్యార్థినులు తెలుసుకోవాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా వ్యక్తుల ఆహారపు అలవాట్ల వలన ఏర్పడే జబ్బుల గురించి కూడా అవగాహన పెంచుకోవాలని, ఎటువంటి పదార్థాలు వాడితే అనారోగ్యం పాలు కాకుండా ఉంటారో సోదాహరణంగా గ్రామస్తులకు వివరిస్తే బాగుంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ కళాశాల అధ్యాపకులు వరలక్ష్మి, ధనలక్ష్మి, భువనేశ్వరి, అనురాధ, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

సీవీఎన్ రీడింగ్ రూమ్ అధ్యక్షునిగా ఈదుపల్లి



విజేతలకు అభినందనలు తెలుపుతున్న ప్రముఖులు

ఒంగోలు మెట్రో: స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించగా, అధ్యక్షునిగా ఈదుపల్లి గురునాథరావు ఎన్నికయ్యారు. వెంకట సుబ్బారావు ఎన్నికల అధికారిగా పోలింగ్ జరగ్గా, మొత్తం 970 మంది ఓటర్లకుగానూ 848 మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రకేసరి ప్రకాశం ప్యానల్ తరఫున 11 పోస్టులకు అత్యధికంగా ఎనిమిది స్థానాలు గెలుచుకుని ప్రెసిడెంట్‌గా ఈదుపల్లి గురునాథరావు విజయం సాధించగా, వైస్ ప్రెసిడెంట్‌గా ఆర్.నితిన్‌రాజరెడ్డి, కార్యదర్శిగా కోడూరి రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా తోట సాయినవీన్, కోశాధికారిగా ఆరిగ వీరప్రతాప్, సభ్యులుగా శేషుబాబు, కరేటి కిరణ్, యామల బాలకృష్ణ, చెక్కా రామకృష్ణారావు, జాల్లిపల్లి పూర్ణచంద్రరావు, తోట శ్రీధర్ విజయం సాధించారు. విజేతలకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.ప్రజలకు ఉపయోగపడేలా సీవీఎన్ రీడింగ్ రూమ్‌ను అభివృద్ధి చేస్తామని నూతన ప్రెసిడెంట్ గురునాథరావు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ వెంకారెడ్డి, ట్రస్ట్ సభ్యులు



విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై అజయ్‌బాబు, దాతలు

సంతనూతలపాడు: మండలంలోని 450 మంది పదో తరగతి విద్యార్థులకు ఏకేఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్టు అధినేత అట్లూరి రామారావు సోమవారం పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. ఎంఈఓ డి.వెంకారెడ్డి, ఎండ్లూరు మాజీ సర్పంచి బొమ్మినేని కుమార్, ట్రస్ట్ అధినేత, అట్లూరి రామారావు విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద, ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు, ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అట్లూరి ఆదిశేఖర్, ఎంఈఎఫ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు టి.ఆల్ ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో...

విద్యార్థులు బాగా చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్ బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సూదునుగుంట కోటయ్య చౌదరి హైస్కూల్లో సోమవారం సేవా సంకల్ప ట్రస్ట్ సభ్యులు తన్నీరు నాగేశ్వరరావు, వెంకటరామిరెడ్డి 97 మంది పదో తరగతి విద్యార్థులకు అందించిన పరీక్ష కిట్లను ఎస్సైతో పాటు ఎంఈఓ డి.వెంకారెడ్డి, హెచ్ఎం ఎం.ప్రమోద, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామిచౌదరి, సభ్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



అల్లూరు హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తపట్నం: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ రచయిత డాక్టర్ భరద్వాజ రావినూతల అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం వాగ్దేవి చారిటబుల్ ట్రస్టు హైదరాబాదు వారు ఉచితంగా పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, తదితర పరీక్ష సామగ్రిని 50 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అల్లూరు హైస్కూల్ హెచ్ఎం ఎం.సుబ్బారావు, విశ్రాంతి బ్యాంక్ మేనేజర్ జెట్టి రాజశేఖరరెడ్డి, సంస్థ ఫౌండర్ రావినూతల సాయిప్రణీత్ సిద్ధార్థ, ట్రెజరర్ కె.శ్రీలేఖ్య, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాగ్దేవి చారిటబుల్ ట్రస్టు వారికి హెచ్ఎం సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.